బుధవారం, తెలంగాణ
03 సెప్టెంబర్ 2025

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం



# రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వం..

**రైతులకు మంత్రి క్షమాపణ చెప్పాలి**
**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**
**రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు**
**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**





**నాగర్ కర్నూల్ ప్రతినిధి సెప్టెంబర్ 2 (నినాదం):** పొలాల్లో పొలం పనులు చేసుకునే రైతులు రోడ్డుపై బైఠాయిస్తుంటే యూరియా సరఫరా చేయలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతగాని అసమర్థ ప్రభుత్వమని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసం నుండి మర్రి జనార్దన్ రెడ్డి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బి ఆర్ ఎస్ కార్యకర్తలతో మంగళవారం పెద్ద ఎత్తున ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు వచ్చి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువుల్లో కుంటల్లో నిండుగా నీళ్ళు ఉన్న తరుణంలో రైతులు పొలాల్లో పనులు చేసుకుంటూ ఉండాల్సింది పోయి యూరియా కోసం రోజుల తరబడి క్యూ లైన్ లో నిల్చుంటున్నారని. పొలాల్లో పని చేసుకునే రైతులు రోడ్లపై ధర్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్లో ఇలా ఉందంటే వచ్చే సీజన్లో యూరియా దొరుకుతుందో లేదోనని ఎంతోమంది రైతులు దిగులు చెందుతున్నారన్నారు రైతులకు యూరియా సరఫరా చేయలేని ప్రభుత్వంలో ఉన్న మంత్రి జూపల్లి రైతులకు క్షమాపణ చెప్పి ఉద్యమంలో పాల్గొనాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు ఎమ్మెల్యేకు చెప్పకుందామని వెళ్లి తమ సమస్యలు చెప్పుకుంటే పప్పు కు చెప్పండి పప్పు దగ్గరికి వెళ్ళండి అంటూ తండ్రి వద్దకు పంపిస్తున్నారని. ఆంధ్రాలో ఒక పప్పు తెలంగాణలో నాగర్ కర్నూల్ లో ఒక పప్పు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఓటు వేసింది మీకా మీ తండ్రికి అంటూ ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే తండ్రి చాటు ఎమ్మెల్యే అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 20 నెలలుగా కేసీఆర్ జపం తప్ప చేసిందేమీ లేదని అన్నారు. రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలుపుతుంటే కాంగ్రెస్ బీజేపీ. బడే భాయ్ చోటే బాయ్ కలిసి లోపాయ కారి ఒప్పందం కుదిరించుకొని సిబిఐ కేసు అంటూ ప్రజల దృష్టి మరలించటానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా కాళేశ్వరం ప్రాజెక్టులో ఆరు కోట్ల అవినీతి జరిగిందని చెప్పటం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు కోట్లు ఖర్చు పెట్టిందని ఆరోపించారు. చంద్రబాబు మెప్పుకోసం కాళేశ్వరం పైన కాలయాపన చేసి మొత్తం గోదావరి జలాలను ఆంధ్రకు తీసుకెళ్లే కుట్ర జరుగుతుందన్నారు. కాళేశ్వరాన్ని సిబిఐకి అప్పజెప్పడం అంటే ఆ ప్రాజెక్టును ఎండబెట్టేందుకే అని అన్నారు. చేతగాని అసమర్థ ప్రభుత్వానికి ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం గ్రామాలకు వస్తే ప్రజలు తగిన శాస్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా మేం తప్పు చేశాం అందుకు తగిన శాస్తి జరుగుతుందని ప్రస్తుతానికి ఎన్నికలు వస్తే తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ ను. సీఎంగా చూడాలని కలలు కంటున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రైతులు ధర్నాలు చేస్తుంటే మరోవైపు కాంగ్రెస్ బిజెపి లోపాయకారి ఒప్పందంతో కేసీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టి బి ఆర్ ఎస్ పార్టీని లేకుండా ఖతం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ బిజెపి నాయకులు ఆరోపిస్తున్నారని అసలు కాళేశ్వరం ప్రాజెక్టు 90 వేల కోట్లతో నిర్మాణం అయ్యిందని మరి లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో కాంగ్రెస్ బిజెపి నాయకులు చెప్పాలన్నారు. గత పది సంవత్సరాలలో యూరియా కోసం ఎక్కడైనా రైతులు రోడ్డు ఎక్కారా అని ప్రశ్నించారు. రైతులు వ్యవసాయం కోసం అప్పులు చేసి పంట కోసం ఎదురుచూస్తున్నారని. ఎకరాకు ఒక యూరియా బ్యాగు మాత్రమే ఇస్తామనడం సమంజసం కాదన్నారు. కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాలలో ఒక్క ప్రాజెక్టు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందా అంటూ ప్రశ్నించారు. రైతులకు బస్తాల్లో యూరియా ఇవ్వమంటే ఇవ్వడం లేదు కానీ బస్తాల్లో డబ్బులు మోసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిందన్నారు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో భూములకు ధరలు లేక రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిందన్నారు. ప్రజల దృష్టి మరలి%శీ%చటానికి బిజెపి తో లోపాయకారి ఒప్పందం చేసుకొని సి.బి.ఐ కేసులంటూ కాంగ్రెస్ బిజెపి డ్రామాలాడుతున్నాయని మండిపడ్డారు. 24 గంటల కరెంటు 150000 ఉద్యోగాలు మిషన్ కాకతీయ మిషన్ భగీరథ కళ్యాణ లక్ష్మి మెడికల్ కళాశాలలు మినీ ట్యాంక్ బండ్లు వెయ్యి గురుకులాలు ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినందుక కేసీఆర్ పై సిబిఐ కేసులు అంటూ ప్రశ్నించారు. 6 గ్యారంటీలు 420 హామీలు అమలయ్యే వరకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిపిఓ భూపాల్ రెడ్డి సేవలు ప్రశంసనీయం

**నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి సెప్టెంబర్ 2 (నినాదం):** ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసి ప్రజలకు సేవలందించే ప్రతి ఉద్యోగి కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ) ద్యాప భూపాల్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూపాల్ రెడ్డి తన విధుల్లో చూపిన నిబద్ధత, నైపుణ్యం, క్రమశిక్షణ ప్రశంసనీయం అని అన్నారు. తాను గత సంవత్సరం నుండి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కాలంలో రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అనేక సమావేశాలు, జిల్లాలో నాలుగుసార్లు ముఖ్యమంత్రి పర్యటనలు జరిగాయని, వాటికి సంబంధించిన సమగ్ర అభివృద్ధి నివేదికలు సిద్ధం చేయడంలో భూపాల్ రెడ్డి సేవలు అమూల్యమని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆర్థిక, సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ కుల గణనలో ఆయన చూపిన కృషి ప్రత్యేకంగా నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. 2 లక్షల 58 వేల సముదాయాలను సమగ్రంగా గణన చేసి సమయానికి నివేదికలు సమర్పించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రతి స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతి నివేదికలను రూపొందించడంలో భూపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. అతని స్నేహపూర్వక వైఖరి, సిబ్బందితో సమన్వయం, క్రమశిక్షణతో పనులు పర్యవేక్షించే తీరు అందరికీ ఆదర్శమని కలెక్టర్ ప్రశంసించారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, సిపిఓ సుజాత, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, డిఇఓ రమేష్ కుమార్, అధికారులు విజయ్ కుమార్, రామ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. అధికారులంతా భూపాల్ రెడ్డి సేవలను కొనియాడుతూ, ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. సన్మాన కార్యక్రమంలో చివరిగా పదవీ విరమణ పొందుతున్న భూపాల్ రెడ్డి మాట్లాడారు. తన మొత్తం ఉద్యోగ జీవితం ప్రజల అభ్యున్నతికే అంకితమైందని, అందరి సహకారం తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. తన సహచరులు, అధికారులు చూపిన సహకారం తన కెరీర్‌లో ప్రధాన బలం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్**
**పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బేగరి రాములు**



**చేవెళ్ళ సెప్టెంబర్ 02( నినాదం):** వ్యవసాయ మార్కెట్ కమిటీ సొంత నిధులతో రైతు బజారులో మౌలిక సదుపాయాలను కల్పించారు. మంగళవారం చేవెళ్ళ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బేగారి రాములు, పాలకవర్గంతో కలిసి రైతు బజార్ ను సందర్శించారు. అనంతరం రైతు బజార్లో కూరగాయలు విక్రయిస్తున్న వారికీ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చైర్మన్ వైస్ చైర్మన్ తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వస్తే మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి


**బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ**



**చేవెళ్ళ సెప్టెంబర్ 02(నినాదం):** విఘ్నాలు తొలగించే వినాయకుడి చల్లని ఆశీస్సులు ప్రజల అందరి పై ఉండాలని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ఆకాంక్షించారు. సోమవారం చేవెళ్ళ నియోజవర్గం షాబాద్ మండలం మాచన్ పల్లి గ్రామంలో వినాయకుడి పూజలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ వినాయకుడు చల్లని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండ అజయ్ కుమార్ కార్యదర్శి బండ శివ కుమార్ వెంకటయ్య మహేందర్ నర్సింలు జైపాల్ మహేందర్ కృష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం చేయడం అనేది హిందువుల సంప్రదాయంగా వస్తుంది

**రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** పండుగల సమయంలో ఉత్సవాలు ముగిసిన అనంతరం పేదలకు అన్నదానం చేయడం అనేది హిందువుల సంప్రదాయంగా వస్తుందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా పుణ్యఫలం సిద్ధిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. గణేష్ నవరాత్రులలో భాగంగా మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్, జయా నగర్, నవోదయ కాలనీ, మియాపూర్ డివిజన్ జె. పి నగర్, హాఫీజ్ పేట్ డివిజన్ మదీనా గూడ, ఓల్డ్ హాఫీజ్ పేట్ విలేజ్, ఆల్విన్ కాలనీ, ప్రకాష్ నగర్, చందా నగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఎన్క్లేవ్, మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్, కొండాపూర్ డివిజన్ కొత్తగూడ విలేజ్, అంజయ్య నగర్ సాగర్ సంఘం వద్ద, బంజర బస్తీలలో స్థానిక కాలనీల ప్రజలు, అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొని, భక్తులకు అన్న వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలకు ఆహ్వానించిన స్థానిక కాలనీ నాయకులకు, అసోసియేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వినాయక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించి, నిమజ్జన కార్యక్రమ సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించాలని అసోసియేషన్ సభ్యులను, స్థానిక ప్రజలకు సూచించారు.

## నేడు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం

**ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**
**సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**
**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండల పరిధిలోని బెండలంపాడు గ్రామంలో అత్యంత వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యవేక్షణలో పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా మారుమూల ప్రాంతమైన బెండలపాడు గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో శరవేగంగా అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం పూర్తయినాయి. ఆ గృహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకోనున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఆ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈ విషయమై వివిధశాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ చారిత్రాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణానికి వచ్చే లబ్దిదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రవాణా, త్రాగునీరు, పారిశుధ్యం, వైద్య సహాయం, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తిగా చేయాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటలలోపే అన్ని బస్సులు సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి బస్సుకు ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి లబ్ధిదారులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సభలో అధిక జనసంచారం కారణంగా ఒత్తిడి తలెత్తే అవకాశమున్నందున చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు సభకు రాకుండా చూడాలని సూచించారు. సభ ముగిసిన తరువాత బస్సుల్లో వచ్చిన లబ్ధిదారులు తిరిగి తమ గమ్యస్థానాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేరుకునే వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రాద్రి జిల్లా గౌరవానికి అనుగుణంగా ముఖ్యమంత్రి పర్యటన అత్యంత పకడ్బందీగా , విజయవంతంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## మహిళల స్వయం ఉపాధి కోసమే శిక్షణ కేంద్రాలు

**మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, సెప్టెంబర్2, (నినాదం):** పాజిటివ్ గా ఆలోచిస్తూ ఎన్ని కష్టాలనైనా నవ్వుతూ అధిగమించి ఉన్నంతలో తృప్తిగా ఉండాలని అక్షయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బోధించారు. మంగళవారం కూకట్ పల్లి ఎల్లమ్మ బండలో ని అక్షయ ఫౌండేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ టైలరింగ్ బ్యూటీషియన్ ఫ్యాషన్ డిజైనింగ్ వంటి వాటిల్లో శిక్షణ పొందుతున్న మహిళలను ఉద్దేశిస్తూ మీరు నేర్చుకునే శిక్షణలో నైపుణ్యం పొందాలని తద్వారా ఉపాధి కల్పించుకోవాలని సూచించారు అందుకు అవసరమైన మార్గనిర్దేశాన్ని సహాయ సహకారాలను తప్పకుండా అందిస్తామని కలెక్టర్ అన్నారు శిక్షణ పొందుతున్న మహిళలందరూ స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి సంఘాలలో చేరితే మెప్మా ద్వారా మీకు ఉపాధి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు మీరు సంఘాలుగా ఏర్పడితే భవిష్యత్తులో విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే అవకాశాన్ని మీకు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా ఈ శిక్షణ కేంద్రానికి అవసరమైన ఎక్విప్మెంట్ కోసం ఎస్టిమేషన్స్ వేసి ప్రతిపాదనలు పంపాలన్నారు అనంతరం బాచుపల్లి లోని జెడ్పి స్కూలు , ఎంపీ స్కూలు పక్కనే పెద్ద పెద్ద బండరాళ్లతో ఉన్న స్థలాన్ని పరిశీలించి అవన్నీ తొలగించి లెవలింగ్ చేయించడానికి ప్రహరీ నిర్మించడానికి ఎంత ఖర్చవుతుంది అంచనా ప్రతిపాదనలను పంపాలని ఈ డబ్ల్యూ ఐ డి సి ఈ ఈ రామ్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఎమ్ ఆర్ ఓ స్వామి అక్షయ ఫౌండేషన్ చైర్మన్ ప్రశాంత్ ఎన్జీవో అడ్వైజర్ అరుంధతి అకాడమిక్ హెడ్ శ్రీదేవి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హైమా విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు. ఈ పర్యటనలో డీఈవో విజయ్ కుమారి బాచుపల్లి ఎమ్ఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం


- **మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 02 (నినాదం) :** పేద ప్రజల ఆకలి తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 6,7,18 వార్డులకు సంబంధించిన 60 మంది లబ్ది దారులకు మంగళవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చడం లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు,లక్ష్మి చిన్న రాంరెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు పర్వపాకుల శేఖర్,నాయకులు సైదులు,దున్న సురేష్,శీను, శేఖర్,రాము,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి విఘ్నాలు తొలగాలన్న తొలి పూజ గణనాధునికే..

**పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా లేదా పూజలు, నోములు, వ్రతాలు చేసినా ఎటువంటి విఘ్నాలు, ఆటంకాలు లేకుండా అవి కొనసాగాలని తొలి పూజను గణనాధునికేనని, ఆ పార్వతీ తనయుడు అనుగ్రహం పొందితే అన్ని కార్యాలు జయమవుతాయని భారతీయుల ప్రగాఢ నమ్మకమని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హఫీజ్పెట్ డివిజన్ పరిధిలోని గంగారం, రామకృష్ణ నగర్, సాయి కృప అపార్ట్మెంట్స్, సాయి నగర్ కాలనీలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమంలో పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గణేశుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ శోభయాత్రాలను జరుపుకోవాలి

- **అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నినాదం):** ప్రజలు భద్రతగా, శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణ రెడ్డి, పోలీస్ కమీషనర్ పీ. సాయి చైతన్యతో కలిసి ఎమ్మెల్యే ధన్ పాల్ గణేష్ శోభాయాత్ర రూట్ మ్యాప్, వినాయకుల భావి దగ్గర జరిగే నిమజ్జన కార్యక్రమాల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రధాన రోడ్లు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన గట్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, . ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. నిమజ్జన దినాన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్ గణేష్ నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేకి వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, నగర మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్, జిల్లా అధికారులు, బిజెపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే తాటి



**దమ్మపేట, సెప్టెంబర్ 2(నినాదం):** మండల పరిధిలోని మందలపల్లి కేజీబీవీ పాఠశాల నందు మండల స్థాయిలో జరుగుతున్న క్రీడలకు అశ్వరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని వాలీబాల్, కబడ్డీ, కోకో క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు పరిచయం చేసుకొని క్రీడా పోటీలలో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని గెలిచినా ఓడినా బాధపడవద్దని అన్నారు. విద్యార్థులు చదువుల్లో, ఆటల్లో ముందు ఉండాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. మండల పోటీల్లో గెలిచి భవిష్యత్ లో జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయికి చేరి తల్లిదండ్రులకు, ఊరుకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో క్రీడాలలో నైపుణ్యత కనబర్చిన విద్యార్థులకు తన పూర్తి సహాయ సహకారాలు, ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

## విద్యారంగంలో అసమానతులను తొలగించడమే డిఎస్ఎఫ్ఐ లక్ష్యం

- **రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయి కుమార్, సూర్య ప్రకాష్**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నినాదం) :** విద్యారంగంలో అసమాన తలను తొలగించడమే భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం (డి ఎస్ ఎఫ్ ఐ) లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, సూర్య ప్రకాష్ లు అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించడం లక్ష్యంగా విద్య కై పోరాడు, ఉపాధికై పోరాడు, విద్యార్థులందరికీ సమాన విద్యాందడమే లక్ష్యంగా, భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతర రాజులేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే 18 నెలలు గడుస్తున్నవిద్యారంగంలో ఎక్కడి సమస్యలు అక్కడే గొంగడిగా పడి ఉన్నట్టు ఉందని, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం చాలా దారుణమని తెలిపారు.. రాష్ట్రంలో దాదాపు 8600 కోట్ల రూపాయల స్కాలర్షిప్లు పెండింగ్లో ఉన్నాయని, సంక్షేమ హాస్టల్లో డైట్ చార్జీలు ఇప్పటివరకు విడుదల చేయలేదని, బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు ఇవ్వకుండా విద్యార్థులను మోసం చేస్తుందని అన్నారు... ప్రవేట్ పాఠశాలలో ఫీజులు దోపిడీ నియంత్రణ కమిటీ వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడి అరికట్టాలని డిఎస్ఎఫ్ఐ సమరసిల పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రాథోడ్ జీవన్, సాయి కృష్ణ లు డిఎస్ఎఫ్ఐ చేస్తున్న విద్యార్థి పోరాటాలకు ఆకర్షితులై సంఘంలో చేరారు. అనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గా రాథోడ్ జీవన్ ను, కో కన్వీనర్ సాయి కృష్ణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విఘ్నేష్, నితిన్, మహేష్,ప్రవీణ్, లక్ష్మణ్ ,అజయ్, సునీల్, మోహన్, నాగేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధిలో పాలకులు విఫలం
### -ప్రధానరహదారిపై బీజేపీ ధర్నా



**మహాముత్తారం, సెప్టెంబర్ 02(నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో విద్యాభివృద్ధిలో పాలకులు విఫలం అయ్యారని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం మండలంలోని దొబ్బలపాడ్ మోడల్ స్కూల్ ఎదురుగా కాటారం- మేడారం ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 ఏండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బహుజన విద్యార్థుల కష్టాలు పట్టించుకోలేదన్నారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అలాగే మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబం 40 సంవత్సరాలకు పైగా పరిపాలన చేసినా మహాముత్తారం మండలంలో విద్య వ్యవస్థ ఎక్కడ ఏసిన గొంగళి అక్కడే ఉన్నట్టు ఉందని విమర్శించారు. మంత్రి శ్రీధర్ బాబు 3 సార్లు మంత్రిగా ఉన్నా మహాముత్తారం మండలంలో బీసీ హాస్టల్ స్వంత భవనం లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటి కైనా పాలకులు పట్టించుకుని మహాముత్తారం మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్ రాజు, డా. రఫీ, నవీన్ నాయక్, సదువలి రావు, మహేష్, శేఖర్, లక్ష్మన్, సిల్వ రాజ్, ఉదయ్, వంశీ, , రమేష్,అనిల్ , నరేష్, కిరణ్, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**మహాదేవపూర్ సెప్టెంబర్ 2, ( నినాదం ):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ జన్మదిన వేడుకలను జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆయన అభిమాన సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద బాన సంచాపేల్చి కేక్ కట్ చేసి సీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం మండల అధ్యక్షుడు ఆన్కారి రంజిత్, రాజేష్, రాకేష్, ప్రవీణ్, వెంకటేష్, జాను, పవన్ తో పాటు అభిమానులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా బిజెపి పట్టణ బంద్ విజయవంతం



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నినాదం):** బిజెపి నాయకులపై అక్రమ అరెస్టులు, కేసులకు నిరసిస్తూ వనపర్తి పట్టణంలో మంగళవారం బిజెపి బంద్ కు పిలుపునిచ్చింది. దీంతో వర్తక వాణిజ్య సంఘాలు, విద్యాసంస్థలు, కళాశాలలు, మర్చంట్ అసోసియేషన్, బులియన్ మర్చంట్, పలు కళాశాల, స్కూళ్లలో నోటీస్ బోర్డ్ లో సెలవు ప్రకటించడం జరిగింది. వనపర్తి ప్రధాన కూడలిలో బిజెపి శ్రేణులు బందుకు సహకరించగలరని ర్యాలీలో పాల్గొన్నారు. బంద్ ను ఉద్దేశించి వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చి వారి కార్యకర్తలు భారత ప్రధాని నరేంద్ర మోడీని శవయాత్రగా తీసుకోవచ్చి దిష్టిబొమ్మ దహనం చేశారని, కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి ఫిర్యాదు చేయడం జరిగిందని కానీ ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు. నరేంద్ర మోడీ మాతృమూర్తిని అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో బిజెపి నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసు నమోదు చేశారని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కు గట్టిగా బుద్ధి చెప్తామని దుయ్యబట్టారు. పోలీస్ వ్యవస్థ ప్రజలను కాపాడి వనపర్తి పట్టణాన్ని శాంతియుతంగా ఉంచాలని కానీ, కాంగ్రెస్ నాయకులు, ప్రజల మధ్య అలజడిని సృష్టించకూడదని అన్నారు. బిజెపి శాంతియుతంగా చేసే కార్యక్రమాలపై అక్రమంగా కేసులు చేస్తే ఇంకా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పన, జిల్లా ఉపాధ్యక్షులు బాశెట్టి శ్రీనివాసులు, మొరార్జీ నాయక్, బాబురావు, పద్మ,కుమారస్వామి, సీతారాములు, జిల్లా కార్యదర్శి రామ్ రెడ్డి, కాటమొని కృష్ణ గౌడ్, శివారెడ్డి,జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఖలీల్,జిల్లా పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూగుర రాములు, దంతోజ్ నవీన్,ఉంద కోటి అంజి, రాయన్న సాగర్,విజయ్, కడమంచి శివ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలకు చర్యలు
### - ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత
### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళ వారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బందితో సౌకర్యాలు కల్పన, సిబ్బంది నియామకం, మెరుగైన వైద్య సేవలకు అధునాతన పరికరాలు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తద్వారా జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ అత్యంత ప్రధానమని స్పష్టంచేశారు. 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి అవసరమైన సిబ్బంది నియామకానికి, పరికరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని ఆసుపత్రిలో ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది నియామకానికి కావలసిన విభాగాల ప్రత్యేక వైద్యులను నియమిస్తామని తెలిపారు. ఇప్పటికే సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చొరవతో సి.టి స్కాన్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలోనే సి.టి స్కాన్ మిషన్ ను ప్రారంభించి రోగులకు సేవలు అందుబాటులోకి తెస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వైద్య సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రిలో ఓపి సేవలు పెరిగాయని అన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై మరింత ఫోకస్ చేయాలని స్పష్టం చేశారు. సింగరేణి సి ఎస్ ఆర్ నిధులతో వైద్య విద్యార్థులకు బస్ సౌకర్యం నకల్పిస్తామని అన్నారు. ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా జె వెంకటేశ్వర్లు,వైద్యులు పాల్గొన్నారు.

## వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల ఏర్పాటు

-ఆసుపత్రి వెనక భాగంలో దివ్యాంగులకు సదరం ధృవీకరణ కేంద్రం ఏర్పాటు

-డయాలసిస్ కేంద్రాన్ని క్రిటికల్ కేర్ యూనిట్ భవనానికి తరలించేందుకు చర్యలు

-ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నినాదం)** వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలో డ్రైనేజ్ పైప్ లైన్లు మార్చడం, సిసి రోడ్లు వేయడం వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని వైద్య విభాగం ఎ.ఈ ని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్ని కలియతిరిగిన కలెక్టర్ పరిసరాల పరిశుభ్రతతో పాటు దివ్యాంగులకు సదరం క్యాంపు ఏర్పాటుకు అవసరమైన గదులను అన్వేషించారు. ఆసుపత్రి వెనక భాగంలో సదరం క్యాంపు ఏర్పాటుకు గదులు సిద్ధం చేయాలని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం పనిచేస్తున్న డయాలసిస్ సెంటరును మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ కు మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కేటరాక్ట్ సర్జరీలు ఎన్ని నిర్వహించారు అని వివరాలు అడిగారు. కంటి వైద్య ప్రొఫెసర్ డా. శ్రీధర్ వివరిస్తూ ఫిబ్రవరి 2025 నుండి ఇప్పటి వరకు 103 మేజర్ శాస్త్ర చికిత్సలు, 113 మైనర్ సర్జరీలు నిర్వహించినట్లు వివరించారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో కేటరాక్ట్ సమస్యతో బాధపడుచున్న వారందరికీ శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో 19,700 మంది మధుమేహం వ్యాధితో బాధపడు చున్న వారిని గుర్తించడం జరిగిందని, మధుమే హం ఉన్న వారు కంటి సమస్యలు ఎదుర్కొంటారు కాబట్టి వారందరికీ ఇళ్ల వద్దనే రేటినోపతి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. డెంగ్యూ జ్వరాలను ఆదిలోనే గుర్తించి సరైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. జ్వరం లక్షణాలతో వచ్చే వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ లేదా వైరల్ జ్వరాల ఎలాంటి జ్వరం ఉందో గుర్తించి అవసరమైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్త పరీక్షల రిజిస్టరును కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ప్రొఫెసర్లు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు

## ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**డోర్నకల్/మరిపెడ సెప్టెంబర్ 02 (నినాదం న్యూస్):** విగ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గణేష్ నవరాత్రోత్సవములు 4 వ వార్షికోత్సవము పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మరిపెడ ఎస్సై బొల్లగాని సతీష్ గౌడ్ పాల్గొని విఘ్నేశ్వరుని పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ వారు శాలువతో సత్కరించారు. హిందూ ధర్మంలో అన్నదానం మహాదానమని ఎస్సై సతీష్ గౌడ్ అన్నారు. ఆర్ఎస్ ప్లాజా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుని పూజలు, సంస్కృతిక కార్యక్రమాలు,భజనలు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ నిత్యం పండగ వాతావరణాన్ని కలిగించే విధంగా ఏర్పాట్లు చేస్తారన్నారు. మహా అన్నదాన దాతలు పొదిల నాగరాజు అన్నపూర్ణ రోటరీ నగర్ ఖమ్మం వాస్తవ్యులు,షేక్ మదార్ నజీమా మరిపెడ మండలం అబ్బాయ్య పాలెం,వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహా అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేసు సత్తి రెడ్డి,వీసారపు శ్రీపాల్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి,దోగుంట్ల వెంకన్న, పాముల సురేష్,నాగరాజు, రాంబాబు, కుదురుపాక విష్ణువర్ధన్,నా రెడ్డి సుదర్శన్ రెడ్డి, వెలమారెడ్డి కరుణాకర్ రెడ్డి,సాగర్, శ్రీనివాస్,దోమ శ్రీను,యాదగిరి, సోమిరెడ్డి,నిరంజన్ రెడ్డి,కృష్ణమూర్తి, సురేష్,కార్తీక్,మహేష్,మౌర్య రాంకిసాన్, శ్రీ సాయి మార్కెటింగ్ ఏజెన్సీ వర్కర్స్,భక్తులు, యువకులు, మహిళా భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు...

## గణనాధుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి





-సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్

-మండలంలోని గణేష్ మండ పాలను సందర్శించిన పడాల

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 02(నినాదం):** గణనాధుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్ పలు గణే ష్ మంటపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించా రు. మంగళవారం సుల్తానాబాద్ మండలం కాట్న పల్లి, చిన్న కల్వల, చిన్న కల్వల,ఉప్పరపల్లి,నీరు కుళ్ళ గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మం డపాలను సందర్శించి,కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ప్ర త్యేక పూజల్లో పాల్గొని గణనాధుని దీవెనలు పొం దారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గణనా థుని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల శుభాలు కలుగు తాయని పేర్కొన్నారు. ఉత్సవాలను ఘనంగా ని ర్వహిస్తున్న గణేష్ నిర్వాహకులకు, యువకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జానీ, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ రావు, విజేందర్, రమేష్, ఉప స ర్పంచ్‌లు, గౌడ సంఘం సభ్యులు, గ్రామ శాఖ అ ధ్యక్షుడు కోటగిరి రమేష్ మూల సత్యం, కాంగ్రెస్ నాయకులు మూల సత్యం, దాసరి సతీష్, రవీం దర్, అజయ్, అంజయ్య, అనిల్, సతీష్, ఆకుల స్వామి, తిరుపతి, ప్రదీప్, మూల సత్యం, గ్రామ ప్రముఖులు, మహిళా భక్తులు, యువకులు తది తరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**మహాముత్తారం, సెప్టెంబర్ 02(నినాదం):** జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మహాముత్తారం మండల కేంద్రంలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని విజయగిరి రమేష్ పంజా ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వీరాభిమాని విజయగిరి రమేష్ అలియాస్ పంజా మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే పవన్ కళ్యాణ్ లక్ష్యమని, సనాతన ధర్మమంటే కేవలం హిందూ మతం కాదని అది మానవత్వమని అందరి ధర్మమని ఈ ప్రపంచానికి చాటి చెప్పిన ఏకైక వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, ఆయన జన్మదినం సందర్భంగా వారిని స్పూర్తిగా తీసుకొని, మండలంలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు పూర్ణచందర్, కల్వచర్ల రాజు, డాక్టర్ రఫీ ఉద్దీన్, సదవలి తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**ఎల్కతుర్తి, సెప్టెంబర్2(నినాదం న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఎల్కతుర్తిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బాక్కి) ఆధ్వర్యం నిర్వహించగా పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకం హాజరై ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబాల శ్రీకాంత్ మాట్లాడుతూ డాక్టర్ వై యస్ రాజశేఖర్ రెడ్డి నిజమైన ప్రజానాయకుడని కొనియాడరు. తన పాలనలో సాధించిన పథకాలతో ప్రతి రైతు, ప్రతి పేద కుటుంబం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ముఖ్యంగా ఉచిత విద్యుత్, రైతు బీమా, 108, 104 అత్యవసర సేవలు, పావలా వడ్డీ రుణాలు, ఆరోగ్యశ్రీ, పేదలకు ఇళ్ళు, జలయజ్ఞం వంటి పథకాలను గుర్తు చేశారు. ఆయన తీసుకొచ్చిన సంక్షేమం పథకాల వల్లే పేదలు, రైతులు, కార్మిక వర్గాలు నమ్మకంగా జీవించగలిగారని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ వైయస్ కల నిజమైన కర్షకపాలన అని, తెలంగాణలోనూ ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని తెలిపారు. యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన అడుగుజాడల్లో నడుస్తామని సంకల్పబద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సుగిన సంతాజి సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్, మాజీ సర్పంచ్ గోడిశాల యాదగిరి, గోడిశాల రాజయ్య, డాక్టర్ రమేష్ బాబు,పాక రమేష్,రంజిత్ రెడ్డి,బచ్చు బాబు రావు, మండ సుమన్, దాట్ల శ్రీకాంత్,వెంకట్, ప్రదీప్, నితిన్, బత్తిని శ్రీనివాస్, రవీందర్,సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టం చేస్తే చర్యలు తప్పవు

**కోదాడ,సెప్టెంబర్ 2(నినాదం):** మునగాల మండల పరిధిలో మార్చి ఏప్రిల్ మే నెలలలో నాగార్జునసాగర్ కాలువ ఎత్తిపోతల పథకాలకు అమర్చిన విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల నుండి కాపర్ దొంగతనం చేసిన నలుగురిని మునగాల పోలీసులు మంగళవారం చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో మునగాల సిఐ రామకృష్ణారెడ్డి తో కలిసి డిఎస్పి శ్రీధర్ రెడ్డి వివరాలు వెల్లడించారు.. తమ ట్రాన్స్ఫార్మర్ల నుండి కాపర్ దొంగతనం చేస్తున్నారని మునగాల మండలానికి చెందిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మునగాల స్టేషన్లో కేసులు నమోదు చేశారు.. రైతులకు నష్టం జరగకుండా తక్షణమే కాపర్ దొంగలను అరెస్టు చేయాలని ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు సాగరకాల పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. కేసును దర్యాప్తు చేస్తుండగానే విశ్వసనీయ సమాచారం మేరకు బరాకత గూడెం కెనాల్పై పలు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగాడుతుండగా మునగాల పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వాస్తవాలు వెల్ల డయ్యాయి..

## గణేష్ నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించుకోవాలి
### -మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్




**సుల్తానాబాద్, సెప్టెంబర్ 02(నినాదం):** గణనాధుల నిమజ్జనం శాంతియుతంగా నిర్వ హించుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ కమి షనర్ తిప్పరాజు రమేష్ నిర్వాహకులకు తెలియ జేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకొని సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాటుచేసిన నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం సీఐ సుబ్బా రెడ్డి, తాహసిల్దార్ బ షీరుద్దీన్, ఎస్సై శ్రావణ్ కుమార్, అశోక్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎ లాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఆ దేశించారు. అదేవిధంగా పెద్ద చెరువు వద్ద ఇరువైపులా బారీ కేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, వాహ నదారులకు ఇబ్బంది కలకుండా ఉండేందుకు చ ర్యలు చేపట్టామని, ప్రజలు సహకరించాలని కో రారు. వారితోపాటు ఏఈ రాజకుమార్, సెక్షన్ ఆఫీసర్ రాజు, మున్సిపల్ సిబ్బంది శ్రావణ్ కు మార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గుండెల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ఆర్
### -ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాల గూడ, సెప్టెంబర్ 02(నినాదం):** రైతుల గుండెల్లో వెలుగులు నింపిన మహోన్నత మహానేత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ వైఎస్ రాజశేఖం రెడ్డి అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం వైయస్సార్ 16 వ వర్ధంతి మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ లోని వైయస్ ర్ విగ్రహం మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు . వైయస్సార్ పరిపాలన ఎంతోమంది రాజకీయ నాయకులకు ఆదర్శనీయం అని అన్నారు. వారు అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎంతోమంది రైతుల, నిరుపేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని.. వారి లాంటి ప్రజా నాయకులు మళ్ళీ రారు అని అన్నారు. వారి సిద్ధాంతాలను బావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మన అందరికీ ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలు,శేఖర్ రెడ్డి రవి నాయక్, మర్రెడ్డి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు బ్రదర్స్ పాల్గొన్నారు..

## రేబీస్ వ్యాధిపై అవగాహన అవసరం
### -డాజివి రమేష్ పశు సంవర్ధక అధికారి



**మిర్యాలగూడ సెప్టెంబర్2 (నినాదం) :** రాబిస్ వ్యాధి పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి డా జి వి రమేష్ తెలియచేశారు. సోమవారం మిర్యాలగూడ పట్టణ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన అవగాహన కు హాజరై విద్యార్థులను,ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి జంతువులను ప్రేమ, దయ, కరుణతో చూడాలని , పిల్లలు చిన్నప్పటి నుంచే జంతువులతో ప్రేమగా మెలగాలని తెలియజేశారు. కుక్కల ద్వారా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధి ఎడల అప్రమత్తంగా ఉండాలి ,కుక్కలను హింసించ కూడదు, కుక్కలు పరుగెత్తుకుంటూ వచ్చినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనం రక్షించుకునే విధానాన్ని తెలియజేశారు. ప్రమాదవశాత్తు కుక్క కాటుకు గురైనట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలల్లో రేబిస్ టీకాలు చేపించుకొని వ్యాధి నుంచి రక్షణ పొందాలని తెలియజేశారు. అన్ని పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని వెంటనే జిల్లాలోని అన్ని కుక్కలకు టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ . మండల ప్రత్యేక అధికారి డా వెంకట రెడ్డి,డా శంకర్ రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి ,ఉపాధ్యాయులు,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 3 సెప్టెంబర్ 2025




## భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ సర్కార్**

**సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**





**జమ్మికుంట, సెప్టెంబర్2 (నినాదం) :** దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఈ దేశాన్ని నియంతృత్వం వైపు మోడీ సర్కార్ తీసుకెళ్తుందని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం రోజున స్థానిక ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో వడ్లూరి కిషోర్ అధ్యక్షతన సిపిఎం అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా "భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే గొంతులను నొక్కుతూ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ,సంపన్న వర్గాల కొమ్ముకాస్తూ, దేశ సంపదను అదానీ అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారన్నారు. ఎలాంటి సంప్రదింపు లేకుండా ప్రత్యేక సమగ్ర సవరణ తెచ్చారని, ఇది ఏకపక్ష నిర్ణయం అన్నారు. పౌరసత్వానికి సంబంధించిన దరఖాస్తులు, డాక్యుమెంటరీ ఆధారాలు అవసరం అవుతాయని పేదవారు ఎక్కడినుండి తీసుకొస్తారు అని ప్రశ్నించారు. బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లు తొలగించారన్నారు. ఎలక్షన్ కమిషన్ బిజెపి పార్టీకి ఏజెంట్ గా పని చేస్తుందన్నారు. రాజ్యాంగ పరిధిని దాటి జోక్యం చేసుకుంటుంది అన్నారు. ఈడి, సిబిఐ, ఐటి, ఎలక్షన్ కమిషన్ లాంటి రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రశ్నించే మేధావులపై, ప్రతిపక్ష పార్టీల నాయకులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు.
రచయితలు, మేధావులపై అక్రమ కేసులు బనాయిస్తూ సంవత్సరాల తరబడి జైల్లో నిర్బంధిస్తున్నారన్నారు.
సామాన్యులకు రాజ్యాంగ ఫలాలు దక్కడం లేదని, అన్నారు. ఒక శాతం మంది చేతిలోనే 50 శాతం సంపద పోగుపడిందన్నారు. దేశంలో దారిద్ర రేఖకు దిగువ 45 కోట్ల మంది ఉన్నారని అన్నారు. బిజెపి పాలనలో ఆర్థిక,రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అసమానతలు పెరిగిపోయాయి అన్నారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వాళ్లే ఇప్పుడు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా ప్రజల మధ్య విభజన తీసుకువచ్చి తమ స్వార్ధ రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు. బిజెపి హాయంలో దళితులపై దాడులు పెరిగిపోయాయి అన్నారు, క్రిస్టియన్ల పై మైనార్టీలపై పెద్ద ఎత్తున దాడి జరుగుతుందన్నారు. రైతు, కార్మిక, వ్యవసాయ కూలీలు, మరియు పేద మధ్య ప్రజలపై పన్నుల భారం మోపుతుందన్నారు. ఒకపక్క దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గాయని దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కొత్తగా పరిశ్రమలు సృష్టించకపోగా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేస్తూ కారు చౌకగా పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామిక వేత్తలకు దోచిపెడుతుందన్నారు. మతం వ్యక్తిగత విశ్వాసం అయినప్పటికీ దానిని రాజకీయాలకు పులిమి బీజేపీ లబ్ధి పొందుతుందని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతాంగ పోరాటంతో దిగివచ్చిన మోడీ ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు దొడ్డిదారిన అవే చట్టాలను అమలు చేసేందుకు పూనుకుంటుందని అన్నారు.
స్వాతంత్రానికి పూర్వం సాధించుకున్న కొన్ని కార్మిక చట్టాలు స్వాతంత్రం వచ్చాక కార్మికుల పోరాటాలతో సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కూల్ గా తీసుకొస్తూ, పని గంటలు పెంచుతూ, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తూ, కార్మికులను మరింత బానిసత్వంలోకి నెట్టే విధంగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా, వారి లాభార్జన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పెట్టుబడి దారీ ప్రయోజనాలు ముందుకు సాగాలంటే హక్కులు చట్టాలు, పోరాటాలు సమ్మెలు ఆటంకంగా ఉండకూడదని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోళ్లు ఇతర చట్టాలు, సవరణలు తీసుకువచ్చిందన్నారు.
మోడీ ప్రభుత్వం ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తుందన్నారు. ఈనాటి అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా బిజెపి నియంతృత నయా ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశ సమైక్యత కోసం లౌకిక శక్తులు ఐక్యం కావాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకుంటూనే, రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రను కాపాడాలన్నారు. ఈ సెమినార్ లో పార్టీ మండల కమిటీ సభ్యులు సభ్యులు జక్కుల రమేష్ యాదవ్,బాసిర సంపత్ రావు, దండిగారి సతీష్, కన్నం సదానందం, ముద్దమల్ల కుమార్, గేరా రాజకుమారి, క్రాంతి, రాజు, కిరణ్, ఐలయ్య, తిరుపతయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత సస్పెన్షన్ బాధాకరమే

**కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

**వ్యక్తిగత సంబంధాలను కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఇస్తారు**

**రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పోరాట యోధుడు కేసీఆర్**

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 2(నినాదం) :** ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారు, ఈరోజు పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు.
తెలంగాణ రాష్ట్ర పరిరక్షణ కోసం 14 సంవత్సరాలు నిరంతరం పోరాటం.. తన జీవితం తెలంగాణ రాష్ట్ర సాధన కే అంకితం చేశారు.కెసిఆర్ అంటే అధికార వాదనలు, పదవీ త్యాగాలు, నిరంతర ఉద్యమం ద్వారా 2014లో ప్రత్యేక తెలంగాణ సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు.అభివృద్ధి రంగంలో రాష్ట్రాన్ని కెసిఆర్ గారు ప్రగతి పథం వైపు నడిచారు.కెసిఆర్ ప్రజల్లో విశ్వాసం, ప్రజాదరణ సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా కవిత విషయం లో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇలాంటి పార్టీ వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడిన గతంలో కూడా ఈ విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అయినా, సొంత కూతురే అయినా కూడా, పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడుతూ అదే ధోరణితో వ్యవహరిస్తూ ఉండడంతోనే పార్టీ ఆమెపై కఠిన చర్య తీసుకుందన్నారు.
ఇది కెసిఆర్ యొక్క నాయకత్వ పటిమ, కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో తనకు ఉన్నటువంటి గొప్పతనాన్ని చాటుకున్నారు. దీనివల్ల కెసిఆర్ నాయకత్వం ఎంత బలంగా ఉందో, వ్యక్తిగత సంబంధాలను కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఇస్తూ కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో తన ధైర్యాన్ని, నాయకత్వ పటిమను చూపించారని అన్నారు.పార్టీకి నష్టం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే, కెసిఆర్ ఎవరికి మినహాయింపు ఇవ్వరని ఇందులో స్పష్టం అయిందన్నారు.ఇది ఆయన నాయకత్వ బలాన్ని ప్రతిఫలింపజేస్తుంది.కాళేశ్వరం ప్రాజెక్టు పైన, తీవ్ర స్థాయిలో బిఆర్ఎస్ బద్నాం చేస్తున్న ఉద్దేశ్యం తో శాసన సభలో బయట చర్చ జరుగుతున్న సమయంలో కవిత గారు మాట్లాడిన మాటలు ఏవైతే ఉన్నాయో, శత్రువు చేసే ఆరోపణలను ఆమోదించే విధంగా ఉన్నాయని తెలిపారు.అవి తప్పులని రుజువు చేస్తున్న తరుణంలో ఈవిధమైన వాఖ్యలు ఏవైతే ఉన్నాయో పార్టీకి తీవ్ర నష్టం కలిగించే వాఖ్యలు అందులో కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అనువనువు అవగాహన ఉన్నటువంటి, అనునిత్యం ప్రజల్లో ఉండేటటువంటి ఓ గొప్ప నాయకుడిగా పేరు తెచ్చుకున్న హరిష్ రావు పైన అవినీతి ఆరోపణలు చేయడం అనేది సరైన విధానం కాదని, ఈ విషయం లో అందరూ చింతిస్తున్నారు.

## ఇల్లందకుంటలో ఘనంగా వైయస్సార్ వర్ధంతి వేడుకలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (నినాదం) :** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు ఇల్లందకుంట మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుడిగా సేవలు ప్రారంభించి ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఒక రూపాయికే వైద్యం అందించి పేద ప్రజలకు వైద్యం అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 1978 లో రాజకీయాల్లో ప్రవేశించి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. 2004లో మొదటి సారి సీఎంగా బాధ్యత తీసుకున్నా సమయంలో "పాదయాత్ర" ద్వారా తెలుసుకున్న ప్రజా సమస్యలపై ఆయన దృష్టి సారించి, ప్రజా సంక్షేమం పట్ల ఆయన నిబద్ధతతో, అకుంఠిత దీక్షతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.అందులో భాగంగానే, రైతుల సంక్షేమం వంటి పథకాలతో ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఫ్రీ ఎలక్ట్రిసిటీ (రైతులకు మొదటే రోజు నుంచి), "రాజీవ్ ఆరోగ్యశ్రీ" మెడికల్ స్కీం, ఇందిరమ్మ హౌసింగ్, పింఛన్ల పెంపు, ఫీ రీయంబర్స్మెంట్, 108, మొదలైన పలు గొప్ప సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఇంగిలేరామారావు మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి గూడపు సారంగపాణి కనుమల్ల సంపత్ ఎక్కటి సంజీవరెడ్డి కనుమల్ల రామకృష్ణ వంగ రామకృష్ణ పెద్ది శివకుమార్ గుడిశాల పరమేశ్వర్ బొమ్మ శ్రీనివాస్ మూడెత్తుల మల్లేష్ మోతేమహేందర్ మీసా రాజయ్య మర్రి వీరారెడ్డి మేడద తిరుపతిరెడ్డి మూరెడ్ల రమేష్ గడ్డి శ్రీనివాస్ ఆరే రమేష్ రెడ్డి బోగం పృథ్వీరాజ్ మంకు ఐలయ్య జక్కు కుమారస్వామి మారేపల్లి వేణు మారెపల్లి వంశీ మురారి రాజు తాడెం దిలీప్ పైడిపల్లి దేవేందర్ గాండ్ల వెంకటేశ్వర్లు జలంధర్ రెడ్డి భోగం చిరంజీవి గొట్టే రాజశేఖర్ గూడపు ఓదెలు ఉప్పుల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జనహృదయనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి

**జమ్మికుంటలో ఘనంగా**

**వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు**




**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (నినాదం) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ సుంకరి రమేష్ లు అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నాయకులు సాయిని రవి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నగంటి మల్లయ్య హాజరై మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాదయాత్ర నిర్వహించి ఒంటి చేతితో రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన ఘనత రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇల్లు అందించిన మహా నాయకుడు డాక్టర్ వైయస్ఆర్ అని కొనియాడారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా 108 వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ఆరోగ్యశ్రీని అందించి ఎంతోమంది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన మహానేత డాక్టర్ వైఎస్ఆర్ అని కొనియాడారు. అలాంటి మహానేత నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి ఆశయాలతో మనము ముందుకు కొనసాగాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి సంక్షేమ పథకాలనే ప్రజలకు అందిస్తూ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఒక డైనమిక్ లీడర్ గా రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటున్నారని సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య అన్నారు. అనంతరం పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల మధ్య నాయకుడు డాక్టర్ వైయస్సార్ అని ఆయన ఆలోచన విధానం నిబద్ధత ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలు మరువలేనివని అలాంటి నాయకుడు లేకపోవడం బాధాకరమని భవిష్యత్తులో వారి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు వెళ్లామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురామారావు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మండల మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న నాయకులు ముద్దమల్ల రవి పాతకాల ప్రవీణ్ లావణ్య దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే చెల్లించాలి

**తపస్ సభ్యత్వ కార్యక్రమంలో అన్నమనేని తిరుపతిరావు**



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (నినాదం) :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఈరోజు జమ్మికుంట మండలంలో జమ్మికుంట, మాచినపల్లి, ఆబాది జమ్మికుంట, కోరపల్లి, మోత్కులగూడెం, రంగమ్మపల్లి, పెద్దంపల్లి, విలాసాగర్, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుంటూ సభ్యత్వ నమోదు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం తర్వాత గత ఫిబ్రవరిలో కరీంనగర్ జిల్లాలో నియామకం పొందిన 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల వేతనాలు ఇప్పటివరకు చెల్లించలేదని వారి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, గత కొన్ని ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని, ఈ మధ్యలో ప్రభుత్వం చేపట్టిన ప్రమోషన్లలో జాయిన్ కాకుండా ఖాళీగా మిగిలిపోయిన మిగతా నాన్ జాయినింగ్ పోస్టులను సీనియారిటీ లిస్టులలో తర్వాత ఉన్న అభ్యర్థులచే భర్తీ చేయాలని, టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులు వారికి రావాల్సిన ప్రయోజనాలు రాకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతూ తీవ్రమైన మానసిక క్షోభకు గురి అవుతున్నారని వెంటనే గ్రీన్ ఛానల్ ద్వారా పదవి విరమణ పొందిన పొందుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు తో పాటు జిల్లా సహా అధ్యక్షులు కట్కూరి శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ వింగ్ కన్వీనర్ జిట్టవేణి శ్రీను, జమ్మికుంట మండల శాఖ అధ్యక్షుడు బైరి సురేష్, కామిరెడ్డి రాజిరెడ్డి, కేతిరి శ్రీనివాస్ రెడ్డి, పింగిలి విజయ, అలబాక పణి కుమార్, బండ సారంగం, స్నేహలత, పద్మ, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలను హామీల పేరుతో నయవంచనకు గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హుస్నాబాద్ బీజేపీ నాయకులు**



**హుస్నాబాద్ సెప్టెంబర్ 2 (నినాదం) :** కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు 420 హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను నయావంచనకు గురి చేసి, మోసం చేయడాన్ని, నిరసిస్తూ ఆరు గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు హుస్నాబాద్ నుంచి బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోల్లపెల్లి వీరాచారి, హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు వెల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్ చారీ, మండల కార్యదర్శులు బసిరెడ్డి రాకేష్ రెడ్డి, బానోతు అనిల్ నాయక్, బీజేపీ సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్, ఆశాడపు శ్రీనివాస్,ఇల్లందుల తిరుపతి, నారోజు నరేష్, లకవత్ శారద, బీజేపీ నాయకులు కరివేద సంజీవ్ రెడ్డి, బూత్ అధ్యక్షులు బొనగిరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## వీణవంకలో బీఆర్ఎస్ నేతల ధర్నా రాస్తారోకో

**అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు.. మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి**



**జమ్మికుంట, సెప్టెంబర్ 2 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై సిబిఐ విచారణ పేరుతో చేస్తున్న దుశ్చర్య ను నిరసిస్తూ వీణవంక మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు వీణవంక మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా కక్ష సాధింపు రాజకీయాలు అని బిఆర్ఎస్ ఆరోపించింది.కాళేశ్వరం ప్రాజెక్టును బీడు భూమిలో నీళ్లు పారేలా చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని ప్రశంసించారు.నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "సీఎం డౌన్ డౌన్" 'వాడెవడు వీడెవ్వడు కేసీఆర్ కి అడ్డెవడు",కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కుట్రపూరితంగా కేసీఆర్ మీద తప్పుడు ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని కథలు సృష్టించి, కమిష న్ల పేరుతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని కాంగ్రె స్రయత్నిస్తోందని అన్నారు.కాళేశ్వరం ద్వారా లక్షల ఎకరాలకు నీరందించిన ఘనత కేసీఆర్ ది అనికొని యాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం వేసింది పియు ఘోష్ కమిషన్ కాదు పీసీసీ కమిషన్ అని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని దండగ అన్న స్థితి నుంచి పండగగా మార్చింది కేసీఆర్ పాలన" అని బిఆర్ఎస్ నేతలు తెలిపారు.కెసీఆర్ మీద ఎన్ని ఎంక్వైరీలు పెట్టినా చివరికి న్యాయమే గెలుస్తుంది అని అన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా కూడా అందిం చలేని పరిస్థితితీసుకొచ్చిందని విమర్శించారు.ఒక్క యూ రియా బస్తా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూ డాల్సిన దుస్థితి నెలకొందనితెలిపారు.రైతులకు వెంటనే సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే రైతు భరోసా, బోనస్, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలనికోరారు.ఈకార్యక్రమంలో పాక్స్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రేణుక తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ లత శ్రీనివాస్, జడ్పిటిసి వనమాల సాధవరెడ్డి, సీనియర్ నాయకులు బాల కిషన్ రావు,మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,బిఆర్ఎస్ సీనియర్నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివంగత సీఎం వైఎస్ఆర్ సేవలు మరువలేనివి



**వెల్గటూర్, సెప్టెంబర్02(నినాదం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ ఆర్ సేవలు మరువలేనివని వెల్గటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళి అన్నారు.వై ఎస్ ఆర్ వర్ధంతి సందర్భంగా వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మండల కాంగ్రెస్ శ్రేణులుఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మంగళవారం వై ఎస్ ఆర్ వర్ధంతి సందర్భంగా పేదలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ.. ఉమ్మడి రాష్ట్రంలో విద్య,వైద్య,ప్రజా అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో వై ఎస్ ఆర్ ఎనలేని కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీసర్పంచ్ రాందేని కోటయ్య, మాజీఉపసర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి, మండల బీసీసెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ గంద్ర శ్రీకాంత్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, ఆలయ కమిటీ ధర్మకర్త బుద్దె రవి, నల్ల తిరుపతి, గుమ్ముల అజయ్, వనపర్తి గిరిధర్, అరెల్లి మల్లేష్, ఎనగందుల నరేష్, పంబాల రాజేందర్, బోర్ మహేష్, కొమురయ్య, శ్రీకాంత్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై సిబిఐ విచారణ దుర్మార్గమైన చర్య



**దమ్మపేట, సెప్టెంబర్ 2(నినాదం):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ జరపాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్రం మొత్తం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు సూచనలతో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు మంగళవారం అశ్వారావుపేటలోని రింగు సెంటర్ లో తెలంగాణ తల్లి విగ్రహానికి మరియు డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖమ్మం, రాజమండ్రి జాతీయ రహదారి పై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని తెలంగాణ ప్రజలను కడుపున పెట్టుకొని పరిపాలన చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ రాష్ట్రంగా కెసిఆర్ తీర్చిదిద్దారని. ఎంతో సంతోషంగా ఉన్న రాష్ట్రాన్ని మాయ మాటల చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చెయ్యలేక పరిపాలన చేతకాక ప్రజల్లో వ్యతిరేకత వస్తున్న తరుణంలో ప్రజలను డైవర్ట్ చేయడం కోసం అపరభగీరథుడు కెసిఆర్ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడమే పనిగా కాంగ్రెస్ నాయకులు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర హెలికాప్టర్ ను సంబంధం లేని వ్యక్తి కోసం పక్క రాష్ట్రాలకు పంపే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ మొహం పెట్టుకొని ఆరోపణలు చేస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. మేము కమిషన్ లు ఇవ్వలేము సారు అంటూ సెక్రటేరియట్ లో ధర్నాలు జరిగిన సంఘటనలు ఎవరి ప్రభుత్వంలో జరిగాయి అనేది కూడా ఆలోచింప చేసుకోవాలన్నారు. ప్రాజెక్ట్ ల వల్ల ఎంతో మందికి మంచి జరిగిందని, మా నియోజకవర్గానికి వస్తె పెద్దవాగు ప్రాజెక్ట్ పనులు చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలనే సోయి లేదనీ, అశ్వారావుపేట నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్రభుత్వం లో మంజూరైన పనులు పూర్తి చెయ్యడం చేత కాదు కానీ పనులు చేసిన నాయకుడిపై లేనిపోని ఆరోపణలు చేయడం ఒక్కటే కాంగ్రెస్ కు వచ్చని, ఒక పక్క రాహుల్ గాంధీ సిబిఐ అనేది బీజేపీ పార్టీకి తొత్తులా వ్యవహరిస్తుందని అంటుంటే అదే పార్టీ ముఖ్యమంత్రి మాత్రం సీబీఐ మీద ప్రేమ వెదజల్లుతున్నాడన్నారు. సిబిఐ అంటే కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ అని ఎన్నికలు వస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి బీజేపీ సహాయంతో కావాలని కెసిఆర్ బద్నాం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ బీజేపీ వాళ్ళవి అన్ని డ్రామాలేనని, బి ఆర్ ఎస్ పార్టీకి కొట్లాడటం కొత్తేమీ కాదని కెసిఆర్ జోలికొస్తే సహించేది లేదంటూ ఫైర్ అయ్యారు.

## ములుకనూరు సంఘాన్ని సందర్శించిన ఉత్తరప్రదేశ్ బృందం



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ సహకార సంఘాన్ని మంగళవారం తెలంగాణ రూరల్ డెవలప్ మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల శిక్షణలో భాగంగా ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు, అనిల్ కుమార్, హెడ్ సెంటర్ ఫర్ డి సెంట్రలైజ్ డ్ ప్లానింగ్ అడ్మినిస్ట్రేషన్ మరియు ఇతర అధికారులు పాల్గొనినారు. ములుకనూరు సంఘము సభ్యులకు అందిస్తున్న కార్యక్రమాలను గూర్చి సంఘ జనరల్ మేనేజర్ రాంరెడ్డి, సంఘ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్ వారికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వారికి వివరించినారు. ఈ కార్యక్రమం లో భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం, సీడీపీఓ స్వరూప,ముల్కనూర్ పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పై బిఆర్ఎస్ ధర్నా



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 02 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమా దేవర పల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద కాలేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ భీమదేవరపల్లి మండలాధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో. నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంగ రవీందర్, సంగ సంపత్, జక్కుల అనిత రమేష్, శనిగరపు సదానందం, అప్పని పద్మ బిక్షపతి, కండె సుధాకర్,ఎర్రబెల్లి తిరుపతి రావు, సల్నాల తిరుపతి, మాడుగుల అశోక్, ధర్నా శ్రీనివాస్, రాగం రమేష్ , మేకల సమ్మయ్య, మాడిశెట్టి కుమారస్వామి, ఏనుగు సురేందర్ రెడ్డి, గద్ద కుమారస్వామి, బొల్లంపెల్లి సుకుమార్, గుతుపల సతీష్ , గుడికందుల రాజు, జక్కుల రాజు, గద్వాల పవన్ , మోరె సంజీవ్, పోలు మహేందర్, ఎల్తూరి ప్రభాకర్, అంబాల చక్రపాణి మొదలగు వారు పాల్గొన్నారు.

## నేడు సీఎం చేతులు మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవం

### -బెండలపాడు సీఎం భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

### -యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్



**దమ్మపేట, సెప్టెంబర్ 2(నినాదం):** అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అత్యధికంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే బెండలపాడు గ్రామం ముందంజలో ఉందని, ఈ సందర్భంగా మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధత కలిగి ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని తెలుపటానికి ఇది నిదర్శనం అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సకాలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఆతిధ్యం ఇస్తున్న అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ చరిత్రలో నిలిచే విధంగా పరిపాలన చేస్తున్నారని కొనియాడారు. నేడు మధ్యాహ్నం జరిగే ఈ ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం మరియు భారీ బహిరంగ సభకు నియోజకవర్గ ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువతి, యువకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అందరూ పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి మరియు క్యాబినెట్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొనే ఈ భారీ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు.

## మరణం లేని మహా నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి.. ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, సెప్టెంబర్ 2(నినాదం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డా వైయస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి వైయస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ, డా వైయస్ రాజశేఖరరెడ్డి మరణం లేని మహానాయకుడనీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయులుగా నిలిచిపోతారన్నారు. ఆయన చేపట్టిన ప్రజాకర్షక పథకాలు, రైతు పేదల సంక్షేమం పట్ల వారు అందించిన ప్రోత్సాహం ఆరోగ్య శ్రీ, 108 లాంటి పథకాలు ఆయనను శాశ్వతంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయేలా చేసాయన్నారు. మనమంతా ఆయన ఆలోచనలను సిద్ధాంతాలను అనుసరించి ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరు కర్తవ్యంగా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, మడకం రాజేష్, తంగెళ్ల విశ్వనాథ్, ఆలమూరు సోమేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి




**వైరా సెప్టెంబర్ 2 (నినాదం)** రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వైరా మండల కేంద్రంలోని బోడెపూడి భవనం వద్దనుండి రింగ్ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి మానవహారం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ విద్యార్థి మహా ప్రదర్శన మా స్కాలర్ షిప్స్ మాకు ఇవ్వాలి, స్కాలర్ షిప్స్ బిక్ష కాదు మా హక్కు అంటూ నినాదించారు. ఈసందర్భంగా జరిగిన మహా ర్యాలీ మానవహారం లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 లో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని నాటి ప్రభుత్వం తీసుకుని వచ్చింది. ప్రభుత్వమే సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన వర్గాల విద్యార్థులకు డిగ్రీ మరియు ప్రొఫెషనల్ కోర్సులు, యూనివర్సిటీ విద్య చదువుతున్న విద్యార్యులకు ఈ ఫీజును చెల్లిస్తుంది. తెలంగాణ రాష్ట్రంగా విభజన చెందినా తర్వాత ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని మార్చాలని చూసింది. విద్యార్థుల ఉద్యమించటంతో వెనక్కు తీసుకుంది. 2014 నుండి 2018 వరకు ఫీజులు చెల్లించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2019- 20 విద్యాసంవత్సరం కొంత బకాయిలను ఉంచింది. అప్పటి నుండి రాష్ట్రంలో 2024 వరకు సుమారు 5358 కోట్ల స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ఇతర స్కీం లకు వాడుకుంది. విద్యార్థులకు ఒక్క పైసా చెల్లించకుండా వారి చదువుల నుండి మధ్యలోనే డ్రాప్ అయ్యే చర్యలకు పూనుకుంది. బిఆర్ఎస్ పాలనలో ఫీజు బకాయిలు ఇవ్వలేదని, ఈ పథకాన్ని తీసుకుని వచ్చింది మా కాంగ్రెస్ అని మేం అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, మరింత అభివృద్ధి చేసి అందరికీ బకాయిలు లేకుండా ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టో లో హామీని ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఫీజుల బకాయిలు చెల్లించలేదు. పైగా ఆర్థిక పరిస్థితి బాగా లేదని బుకాయిస్తుంది.

## ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి పథకాలను తక్షణమే అమలు చేయాలి



**ఖమ్మం, సెప్టెంబర్02(నినాదం):** వ్యవసాయ కూలీ మహిళలందరికీ ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి పథకాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఐ గిరిప్రసాద్ భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక -సంఘం (బికెఎంయు) జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ -సమావేశంలో ముఖ్య అతిథిగా దండి సురేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ పేద కూలీల కుటుంబాల భరోసా కోసం యూపిఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీ పోరాడి సాధించిన ఉపాధి హామీ పథకాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పేద ప్రజల హక్కులను, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా రాజ్యాంగబద్ధంగా ప్రజలకు దక్కాల్సిన హక్కులను సాధిస్తామన్నారు. మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. అర్హులైన నిరుపేద వ్యవసాయ కూలీ మహిళలందరికీ మహాలక్ష్మి పథకం ద్వారా -నెలకు రూ.2500, ఆత్మీయ భరోసా ద్వారా ఏడాదికి రూ. 12వేలు తక్షణమే అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రెండు వేల నుంచి నాలుగువేలకు పెంచాలని, దివ్యాంగుల పింఛన్ ను ఆరువేలకు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా కాకుండా ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పోడు సాగుదారులందరికీ పట్టాలు మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం వ్యవసాయ కూలీల పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని దండి సురేష్ తెలిపారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జిల్లాలోని వ్యవసాయ కూలీలు, మహిళా కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు బత్తిని సీతారాములు, సింగారపు సత్యనారాయణ, పిట్టల రాంబాబు, బోడా చీనా, మేళ్లచెరువు -వీరబాబు, మదారి ఈశ్వరమ్మ, లచ్చిరాం, బట్టు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం జన్మదిన వేడుకలు



**చేవెళ్ళ,సెప్టెంబర్ 02 (నినాదం):-** చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ నాయకులు కేఎస్ రత్నం జన్మదినం నియోజకవర్గం మొయినాబాద్‌లోని ఆయన నివాసంలో విశిష్టంగా జరిగింది. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. పూలదండలు కాకుండా పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని రత్నం సూచించగా వాటిని నిరుపేద విద్యార్థులకు పంచారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి యువకులు రక్తదానం చేశారు. ప్రజా సేవలో వినూత్న ఆలోచనతో రత్నం అందరినీ ఆకట్టుకున్నారని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశపల్లి వెంకట్ రాంరెడ్డి, డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి, గుండన్నగారి వెంకట్ రెడ్డి అత్తిలి అనంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జంగారెడ్డి వడ్డేగని, వెంకటేష్ పాగ, పత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పలు గణపతి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ, తార నగర్, తుల్జాభవాని దేవాలయం ప్రాంగణంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తో కలిసి పలు వినాయక మండపాలను సందర్శించి ఆ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చేవాడు వినాయకుడని అన్నారు. ఏ కొత్త పని ఆరంభించినా, ఏ పండుగ వచ్చినా, శుభకార్యాలు జరిగినా తొలి పూజలందుకునే గణపతిని ఎవరైతే.. నిజాయితీగా, నిండు మనస్సుతో కొలుస్తారో వారి కోరికలను తీర్చి సంపదల్ని, అదృష్టాన్ని విఘ్నేశ్వరుడు ఒసగుతాడని అన్నారు. అందుకే విఘ్నేశ్వరుడిని ప్రతినిత్యం నిష్టతో ప్రార్థించిన వారికి అనుకున్న కార్యాలు సిద్ధిస్తాయని ప్రతి ఒక్కరి విశ్వాసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, భక్తులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాధవనగర్ కాలనీలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు




**మహేశ్వరం, సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్):** చంపాపేట్ డివిజన్ మాధవనగర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, సిద్ధి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంగళవారం ఘనంగా సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా చిన్న గౌడ్, రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కర్నాకర్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్, బత్తుల శ్రీనివాస్ రెడ్డి, మద్ది చైతన్య రెడ్డి, గోపాల్ గౌడ్, పల్లెల శ్రీనివాసరెడ్డి లు వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బి.ఆర్.ఎస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, దాసరి సుశాంత్, సంతోష్ రెడ్డి, సాయి కుమార్ రెడ్డి, వినయ్, ప్రశాంత్ కుమార్, మనోహర్, రంజిత్, నిఖిల్ రావు, చందు, శరత్, యాదగిరి తదితరులు పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పూజలు చేశారు.

## వినాయక మండపాలను సందర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడిపిఎల్, జగద్గిరిగుట్ట శివ నగర్, పద్మ నగర్ లలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ స్థానిక పార్టీ ముఖ్య నేతలతో కలిసి గణేష్ మండపాలను సందర్శించి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీ జెకె శేఖర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు కట్ట కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నగర్ లోని అరుంధతి నగర్ లో విఘ్నేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన చామకూర మహేందర్‌రెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య. జవహర్ నగర్ ( నినాదం)



కాలేశ్వరం పై కాంగ్రెస్ తీరును నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన మాజీ మేయర్ మేకల కావ్య, బి ఆర్ఎస్ శ్రేణులు. జవహర్ నగర్ (నినాదం)

## అష్టగుర్తి గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



**వైరా సెప్టెంబర్ 2 (నినాదం)** వైరా మండల పరిధిలోని అష్టగుర్తి గ్రామంలో దిగువంత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16 వర్ధంతి కార్యక్రమంలో అష్టగుర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అష్టగుర్తి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పయ్యావుల నరసింహారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుమ్మ వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు షేక్ సైదా, బాబు, జగదీష్, గణేష్, గుమ్మ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ గుమ్మ చంద్రకళ, మాజీ వార్డ్ నెంబర్ షేక్ సైదాబీ, గుమ్మా లక్ష్మణ్, బలగాని నరసింహారావు, షేక్ సాయి, బాబు లాల్, మల్లయ్య, గోవిందమ్మ, నాగేశ్వరరావు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**ఖమ్మం, సెప్టెంబర్ 02(నినాదం):** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో మాజి ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 16 వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మరియు శ్రేణులతో కలిసి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా రాజశేఖర్ రెడ్డి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. నాడు ఆయన అమలుచేసిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలు నేటికీ చిరస్థాయి గా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్,కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు,లకావత్ సైదులు నాయక్, బద్దె నిరంజన్,చామకూరి చామకూరి వెంకటనారాయణ, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్,గజ్జి సూర్యనారాయణ,జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్,మూడుముంతల గంగరాజు యాదవ్,నల్లమోతు లక్ష్మయ్య, నగర కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు షేక్ అబ్బాస్ భేగ్, బీరెడ్డి రమేష్,నూకారపు వేంకటేశ్వరరావు,కమతం రామకృష్ణ,మహమూద్, పాల్గొన్నారు.

## గణపయ్య పూజల్లో వనం లక్ష్మీకాంత్ రెడ్డి



**చేవెళ్ల,సెప్టెంబర్ 02 (నినాదం):-** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల మండల పరిధి కౌకుంట్ల గ్రామంలో శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విగ్నేశ్వరుడి పూజల్లో యువ నాయకుడు వనం లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు బి.నాగేశ్వర్ రెడ్డి, సాయిరాం గౌడ్ , దశరథ, సుధాకర్ గౌడ్, శేఖర్, వెంకటేష్, ఆంజనేయులు, శ్రీనివాస్, రత్నం, కరంజి, గ్రామస్తులు శ్రీ సాయిగణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం 3 సెప్టెంబర్ 2025

## నేడు కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి కొడంగల్ రాక

**కొడంగల్, సెప్టెంబర్ 02(నినాదం):**
నేడు కొడంగల్ లో ఉర్దూఘర్ షాదిఖాన శంకుస్థాపన చేయడానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి రానున్నట్లు అధికార పార్టీ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్ తెలిపారు. ఈకార్యక్రమంలో మంత్రి తోపాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఎనుముల తిరుపతి రెడ్డి పాల్గొంటారని అన్నారు

## పంచాయతీ వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం

**కొడంగల్, సెప్టెంబర్, 02 (నినాదం):**



గ్రామ పంచాయతీ వార్డు వారిగా ఓటరు జాబితా సిద్ధం అయినట్లు కొడంగల్ మండల అభివృద్ధి అధికారి ఉషశ్రీ అన్నారు. మండ లం లో మొత్తం 25 గ్రామాల్లో 222 వార్డులు,32205 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె అన్నారు. సిద్ధం చేసిన ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులకు చేరవేసినట్లు తెలిపారు.

## వినాయక మండపాలను సందర్శించిన కార్పొరేటర్ రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరా మారం డివిజన్దేవేందర్ నగర్ రాధాకృష్ణ దేవాల యంలో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి దంపతులు శ్రీ గణేష్ న్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం దసరా నవరాత్రి సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలపై మార్వాడి సోదరులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్. జిల్లా మోర్చా ఉపాధ్యక్షులు లకోజి మురళీకృష్ణ హీరాలాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. గాజులరామారం డివిజన్ రావినారాయణ రెడ్డి నగర్ ఈస్ట్ లో శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ కమ్యూనిటీ హాల్ నందు వినాయకుడిని దర్శించుకున్న బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి. వారితోపాటు వాటర్ వర్క్స్ మేనేజర్ రోహిణి, మురళీకృష్ణ, భాస్కర్, సోమేశ్, నాగేష్, చిన్న మురళి, ప్రభాస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రావినారాయణరెడ్డి నగర్ రహదారి వాటర్ లీకేజ్ సమస్యను పరిశీలించారు.


## అన్నపూర్ణేశ్వరుడు గా అలంకరణలో దర్శనమిచ్చిన విఘ్నేశ్వరుడు

**జిన్నారం/ పటాన్ చెరు సెప్టెంబర్ 2 (నినాదం):**



పటాన్ చెరు నియోజకవర్గ పరిధి లోని రుద్రారం గ్రామ శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం పంచామృత అభిషేకము మరియు విశేష శ్రీ అన్నపూర్ణే శ్వరుడిగా ప్రత్యేక అలంకరణతో దర్శనమిస్తున్న సిద్ధి గణపతి ప్రతిరోజు మహా చండి హోమం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు విశేష అభిషేకాలు అలంకరణతో పల్లకి సేవ వివిధ సాంస్కృతి సాంప్రదాయ భక్తిశ్రద్ధలతో భజన సంకీర్తనలతో మహిళల కోలాటాలతో భక్తులను అలరింప చేశాయి అనంతరం ఈవో లావణ్య మాట్లాడుతూ... భక్తులకు వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్న సిద్ధి గణపతి భక్తులకు నవరాత్రుల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నదాన కార్యక్రమాలు మంచినీటి సౌకర్యం అందరి సామాన్య భక్తులకు సిద్ధి గణపతి దర్శనం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి లావణ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది,భక్తులు గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు.



**జవహర్ నగర్ సెప్టెంబర్ 2 (నినాదం):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎన్. వసంత హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని చెన్నాపురం చెరువు సమీపంలో బహిరంగ ప్రదేశంలో ఓ వ్యక్తి చెత్తను వేస్తుండగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ జవహర్ నగర్ ను పరిశుభ్రమైన నగరంలో తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం తోడవ్వాలని ఇంటికి వచ్చే ఆటో రిక్షాలోనే చెత్తను వేయాలన్నారు. జరిమానా బోర్డులను పెట్టుకొని కొందరు కావాలని చెత్తను వేస్తున్నారని, అలాంటి వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశంలో చెత్తను వేసిన వ్యక్తికి రూ రెండు వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కృష్ణప్ప సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**దమ్మపేట, సెప్టెంబర్ 2(నినాదం):**



మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా కంటి వైద్య శిబిరాన్ని అశ్వారావుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ మెగా కంటి వైద్య శిబిరంలో సుమారుగా 75 మందికి డాక్టర్ రవిచంద్ర కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతు అంకత ఉమామహేశ్వరరావు, దారా యుగంధర్, పసుమర్తి రాంబ్రహ్మం, రాచూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

# పలు వినాయక మండపాలను సందర్శించిన రాజేందర్ రావు

**కరీంనగర్ సెప్టెంబర్ 1(నినాదం):**
గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పలు వినాయక మండపాల వద్ద సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సోమవారం విస్తృతంగా పాల్గొన్నారు. కరీంనగర్లో బుట్టి రాజారాం కాలనీ, కోతిరంపూర్ చౌరస్తా, లక్ష్మీనగర్, కిషన్ నగర్ తో పాటు పలు చోట్ల వినాయక విగ్రహాల వద్ద రాజేందర్ రావు ప్రత్యేక



పూజలు నిర్వహించారు. కరీంనగర్ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని స్వామివారిని రాజేందర్రావు వేడుకున్నారు. బుట్టి రాజారాం కాలనీ, కోతిరాంపూర్ చౌరస్తా, లక్ష్మీ నగర్, కిసాన్ నగర్ లో అన్నదాన కార్యక్రమాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు, మహిళలందరికీ రాజేందర్ రావు భోజనం వడ్డించారు. వినాయక మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజలు రాజేందర్ రావు కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు రావు మాట్లాడుతూ వినాయక నవరోత్రోత్సవాల సందర్భంగా కరీంనగర్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరుస్తుందని పేర్కొన్నారు. ప్రతి వాడలో స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయని ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గణనాథుని కృప వల్ల కరీంనగర్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు రాజేందర్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు, ఆయా కాలనీల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపురం కాలనీ చౌరస్తాలో వైయస్ విగ్రహం ఏర్పాటు

**- వైయస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నినాదం):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ మహదేవపురం కాలనీ చౌరస్తాలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రజానేత వైయస్సార్ అని కొనియాడారు. ఆయన చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను నేటి ప్రభుత్వాలు కొనసాగించడంతో ఫీజు రియింబర్స్మెంట్ ఆరోగ్యశ్రీ ఉచిత విద్యుత్తు వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. మహాదేవపూర్ చౌరస్తాలో వైయస్సార్ అభిమానులు ప్రత్యేకంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి వైయస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రజల్లో చిరకాలం గుర్తుండేలా సహకరించిన వారందరినీ ఈ సందర్భంగా కూన శ్రీశైలం



గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కెకెయం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్,విగ్రహ దాత, ఆర్గనైజర్ రామచంద్రారెడ్డి, మహదేవపురం కాలనీ అధ్యక్షులు వెంకట రెడ్డి, ప్రధాన, కార్యదర్శి ప్రసాద్ దుగ్యాల, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, గోపాల్, అసోసియేషన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి ,ప్రవీణ్ కుమార్, దిలీప్ కుమార్ ,మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామ కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, యాదగిరి చారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నినాదం):**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ నందా నగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం, పాఠశాల విద్యార్థులకు హెచ్ఎంటి కాలనీలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోపాటు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని అధ్యాపక బృందానికి సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు యువతకు భవిష్యత్తులో ఉజ్వల భవిష్యత్తుతో పాటు ఉద్యోగ అవకాశాలను రిజర్వేషన్ ఉంటుందని వివరించారు. నిర్వహించిన క్రీడలు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వారు నిర్వహించిన క్రీడల్లో భాగంగా కోకో, కబడి, 100 మీటర్ల పరుగు పందెం, స్ప్రింట్, రిలే రేస్, తదితర క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయురాలు స్వర్ణ, ఫిజికల్ ట్రైనింగ్ ఉపాధ్యాయులు కిరణ్ సాగర్, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**మహేశ్వరం సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్)**
కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలంలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ముందుగా మండలంలోని కొండ్రిగాని బోర్డ్ తండాలో ఇటీవల మృతి చెందిన సభావత్ భీమ్లి కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు ద్వారా ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించగా మాజీ ఉపసర్పంచ్ శ్రీను నాయక్ 10500 రూపాయల ఆర్థిక సాయం అందించారు. అనంతరం సలార్పూర్ గ్రామంలో సోమవారం మృతి చెందిన జంగయ్య కుటుంబాన్ని పరమర్శించి. అనంతరం జంగయ్య భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగయ్య కుటుంబానికి ట్రస్టు ద్వారా ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన నెనావత్ లక్కీ కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు ద్వారా 5000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు మాజీ



ఎంపీటీసీ ప్రియా రమేష్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు మాజీ వార్డు సభ్యులు బాబా శ్రీను నాయకులు హరిచంద్ శ్రీను మున్యా బాలు పాండు తావు వెంకటయ్య చంద్రు బావోజి సేవ్య వెంకటేష్ శరత్ వినోద్ గణేష్ నరేష్ నాజం లక్య రమేష్ సిలారి శ్రీధర్ గోబ్రు మున్యా చందు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి నగర్ కాలనీలో ప్రత్యేక పూజలు

**మహేశ్వరం సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్):**



సరస్వతి నగర కాలనీ క్రింద నేల కోల్పిన వినాయక మండపం వద్ద కాలనీ అధ్యక్షులు అయిన లిఆర్ మేఘా రెడ్డి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. ఇట్టి అన్న వితరణ దాతలు కరుణ లక్ష్మారెడ్డి దంపతులు. అదేవిధంగా ఈ సంవత్సరం వినాయక విగ్రహ ధాత అయిన శ్రీమతి పద్మ సుధాకర్ రెడ్డీ. ఇట్టి కార్యక్రమంలో కాలనీ వాసులు అయిన మధుసూదన్ రావ్,చక్రం చారి, ప్రేమ్ కుమార్ (ప్రేమ్) ,జీవన్ గౌడ్, రామ్ గౌడ్, లింగం గౌడ్ దయాకర్ గౌడ్, శ్రీనివాస్ రావు, వాసుదేవ్ రావు, శంకర్ రావ్, వెంకట స్వామి రావ్, యాదయ్యగౌడ్,శివ,మురళీ,రమేష్ రెడ్డి, నరసింహారెడ్డి,కృష్ణ రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,గోవింద్ రెడ్డి, నర్సరెడ్డీ, కృష్ణ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శివలింగం, అప్ప,నారాయణ,రవి , ఉమేష్ మరియు కాలనీ వాసులు అందరూ మహిళలు కలిసి కార్యక్రమని విజయవంతంగా నిర్వహించారు

## కనకదుర్గ దేవాలయానికి సీలింగ్ ఫ్యాన్ వితరణ




**ఖమ్మం, సెప్టెంబర్ 02(నినాదం):**
వాసవి వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు కార్యక్రమ సందర్భంగా వాసవి క్లబ్ ఖమ్మం అధ్యక్షులు పసుమర్తి రామ్మోహన్రావు ఆధ్వర్యంలో సందర్భంగా ఖమ్మం పట్టణంలో రజక వీధి నందు గల శ్రీ కనకదుర్గ శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయము ప్రాంగణంలో సీలింగ్ ఫ్యాన్ వితరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం ఉమ్మడి జిల్లా వాసవి క్లబ్స్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు , క్యాబినెట్ కోశాధికారి గుంటుపల్లి దివాకర్ గుప్తా, ఖమ్మం వాసవి క్లబ్ సెక్రటరీ వే ద్చా కృష్ణమోహన్ కోశాధికారి పసుమర్తి శ్రీనివాసరావు . తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్వామివారికి ప్రత్యేక పూజలు



**మహేశ్వరం సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్)**
ఛత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో 58వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం గణపతి పూజ, నక్షత్ర దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు బి.జయలక్ష్మి, ఎస్.శైలజ, అనంతలక్ష్మి, లహరి, ప్రణతి, కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, బి.రవీందర్, బి.వెంకటేష్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## జగ్యా తండాలో ఘనంగా అన్నదానం



**ఖమ్మం, సెప్టెంబర్ 02(నినాదం):**
వి వెంకటాయపాలెం జగ్య తండాలో అన్నదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాధపాలెం మండలం వివి పాలెం లో ని శివారు జగ్గయ్య తండా గ్రామ యువత ఆధ్వర్యంలో శ్రీ గణేష్ నవరాత్యాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గణేష్ మండపం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకుడు దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ అన్నదానం



**మహేశ్వరం సెప్టెంబర్ 2 (నినాదం న్యూస్):**
డోంతులగుట్ట యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం గణేష్ అన్నదానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ నిర్వహించి భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా డి.వై.ఏ సభ్యులు మాట్లాడుతూ %-% "గణపతి ఉత్సవాల్లో అన్నదానం ఒక మహత్తరమైన పుణ్యకార్యం. ఇది సమాజంలో ఐక్యత, సోదరభావాలను పెంపొందించే ఆధ్యాత్మిక సంప్రదాయం" అని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొనడం వల్ల కార్యక్రమం మరింత విశేషంగా, విజయవంతంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.